# శబరి

## *ఉదయ రావు*

రాముడు తమ్ముని తోడ పంపకు రాగ, మిక్కిలి భక్తితో
రాముని రాకకు వేచియున్ శబరచ్చటున్న కుటీర మం
దే, ముని వర్యులు వీడి వెళ్లగ దేవ లోకము ముందటన్ ,
యా మహిళొప్పుగ పాద్యమిచ్చెను, యంతరంగము పొంగగా.

మాయ తెరుంగని భామ వారికి మంచి పండ్లను యేర్చుచున్ ,
ఈయక ముందుగ దా రుచించెను యెంగిలంచు తలంపకన్ ,
తీయని పళ్లను తెచ్చి యిచ్చెను, తేనెలున్ , మరియాదతో,
తోయలొసంగిన పండ్లు రాముడు దోసమెంచకనే దినెన్ .

దాంతులు వెళ్లిన బుణ్య లోకము తన్ను జేర్చు వరంబు నా
కాంతయు కోరగ, యిచ్చె నా భుపికాంతు డామెకు దీవెనల్ ,
శాంత పథంబున స్వర్గ భూమికి సాధు వర్గము వద్దకున్
యంతట పంపెను, భక్తురాలికి యాత్మసిద్ధి నొసంగుచున్ .

రామ లక్ష్మణులకు తీయని పళ్లు సమర్పించు ప్రేమాభిమానముతో, శబరి మొదట పళ్లను తానే రుచి చూసి, పిమ్మట రాజకుమారుల కిచ్చెనను విషయము సామాన్యముగా చెప్పుకొన్నను, ఈ సంగతి వాల్మీకి, మొల్ల, రామాయణములలో లేదు. తులసీదాసు రామాయణములో ఈ వృత్తాంత మున్నదని ఒక స్నేహితుడు చెప్పాడు. అంతేకాక, రాముడు శబరి ఇచ్చిన ఫలములను ఎంగిలని సంకోచింపక తినెను కాని, లక్ష్మణుడు శబరికి తెలియకుండా, వాటిని తినక, పారవేసెనని కథలో ఉందిట. లక్ష్మణుడు పారవేసిన ఫలముల గింజల నుండి మొక్కలుద్భవ మయ్యెననియు, లక్ష్మణుడు యుద్ధభూమిలో సొమ్మసిల్లి నప్పుడు, హనుమంతుడు ఈ మొక్కలను కొండతో సహా తెచ్చి, వాటి పసరు లక్ష్మనునికి ఈయగా, అతడు మేల్కొనెననియు, ఈ విధముగా, తాను ముందు నిరాకరించిన ఫలముల నుండి వచ్చిన మొక్కల పసరే తుదకు లక్ష్మణుని నోటిలో చేరిన పిమ్మట, అతని మూర్ఛ తొలగెనను చిత్రమైన కథ గలదు.

